# కావ్యకన్యక

'క్షేమయ్యా?'

'దేవా! ఇక్కడే వున్నా!'

'ఏమిటోయి ఈ కవి పంపించుకున్న మహజరూ?'

'చిత్తం! ఆయన తమ బాబయ్యగారి కాలంనుంచీకూడా మన ఆస్థానంలోనే బ్రతుకుతున్నాడండి-'

'అయితే, ఇప్పుడేమంటాడూ? జీతం హెచ్చుచెయ్యమంటాడా, యుద్ధపు అలవెన్సు ఇయ్యమంటాడా...?'

'లేదు లేదండి! అంతమాట అనగలడా?'

'మరేమిటీ, ఇంత గ్రంథం, రాసుకొచ్చాడూ?'

'చిత్తం! ఈ మధ్య ఆయన సృష్టించిన కావ్యకన్యకను-'

'ఏం కన్యకా?'

'కావ్యకన్యకండి! దాన్ని తమకు కృతిసమర్పణ చేద్దామని-'

'నాకే? నాకేనటోయి?'

'చిత్తం! తమకేనండి-తమ జన్మదినోత్సవ సందర్భంలో, తమరు నిండుపేరోలగంలో, పూర్ణ చంద్రునివలె ప్రకాశిస్తూవుండగా-'

'ఊఁ!'

'వంధిమాగధులు తమ కీర్తిని స్తుతిస్తూ వుండగా, సురపుంగవులు వేదోక్త మంత్రాక్షతలతో తమ మకుటంపై ఆశీర్వాదశతాలు భోరున వర్షిస్తూ వుండగా—'

'ఊఁ! బావుంది!—'

'నృత్యగానాదులతో, మేళతాళాలతో దేవదాసీలు తమ సభను దేవేంద్ర సభగా మారుస్తూండగా—'

'భేష్! మంత్రీ!'

'అటువంటి మహత్తర గడియలలో ఈ పండితుడు తమ కావ్యకన్య

కను తెచ్చి ప్రభువువారి కైవశంచేసి, తమ కటాక్ష వీక్షణాల్ని పొంద డానికి సంకల్పించుకున్నాడు–'

'చాలా మంచివాడిలా కన్పిస్తాడు. మనమీద ఎంత అభిమానం! అయితే చూడు. శేషయ్యా, మనలోమాట–మనం దాన్ని స్వీకరించ వచ్చునంటావా?'

'ఎవరినండీ?'

'అదే–ఆ... కన్యకను.'

'భేషుగ్గా స్వీకరించవచ్చునండి–తప్పేముంది? మీరు మహారాజు, అతను మహా పండితుడు, అది మకరందాన్ని పోలిన కావ్య సుందరి–'

'నిండు సభలోనే తెచ్చి యిస్తాడా?'

'అవునండి–దానికేం? నిండు సభలో ఇస్తేనే తమ ఘనత, దాని ఘనత, ఆ పండితుడి ఘనతాను!

'శేషయ్యా ?'

'ఏం ప్రభూ? అలా అయిపోతున్నారేం?'

'ఈ కావ్య కన్యకను––ఈ పండితుడు మనకి దఖలు చేస్తానన్న–?'

'ఊ! ఏమిటండి దాని సంగతి?'

'మా అమ్మతో చెప్పవద్దుటోయి?'

'దానికేమండీ? చెబుదాం–'

'ఆవిడకు తెలిస్తే ఏమైనా అంటుందేమో?'

'మాతృశ్రీగారా? తమర్నా? ఏమైనా అనడమా? తమరు ఏమంత మహాపాపం చేస్తున్నారనీ? విశేషించి, ఈ వార్త విని ఆవిడ ఎంతో సంబరపడుతుంది–—'

'నాకేదో దిగులుగా వుందోయి?'

'ఏమీ దిగులు చెందకండి–దిగులు చెందవలసినదేమీ లేదు ఇందులో–'

'శేషయ్యా?'

'ప్రభూ?'

'ఈ పండితుడు తన తాలూకు కావ్యకన్యకను నాకు తెచ్చి ఇవ్వ డంలో వుద్దేశ మేమిటోయ్?'

'చిత్తం! తమరికిగాక ఇంకెవరికిస్తాడండి? తమరే సర్వవిధాలా దాన్ని స్వీకరించడానికి అర్హులు--'

'మా బాబయ్యగారు బ్రతికివుండే రోజుల్లో ఆయన ఇలా...ఏమైనా స్వీకరించాడా?'

'లక్షలాది! ఇందులో తప్పేముందండీ?'

'సరే అయితే! దాని పేరేమిటోయ్?'

'దేని పేరండీ?'

'అదేనయ్యా, ఈ పండితుడు మనకి ఇవ్వబోయే—'

'చంద్రకళండి—'

'పేరు చక్కగా వుంది!'

'పేరుకుతగిన ఆకర్షణ కూడా వుందండి దానిలో.'

'అయితే... శేషయ్యా?'

'చిత్తం! ప్రభూ!'

'మాడూ, దాని వయస్సెంతా...?'

'...............'

# అభ్యుదయం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'నువ్వు తిమ్మరుసువంటి వాడివోయి—'

'ఏదో, ప్రభువులు అభిమానం కొద్దీ అలా అంటారే గాని—'

'శేషయ్యా?'

'చిత్తం! దేవా!'